రిపోర్టర్లు కావలెను
తొలి సమయం
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న 'తొలి సమయం' మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9000689544, 7569944360 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి : 02 సంచిక : 286 బుధవారం 29-10-2025 ఎడిటర్ వేముల అయోధ్య రాములు పేజీలు : 6 వెల : 5/-

## ఏపీ వ్యాప్తంగా మొంథా ప్రభావం



**-పవన్ కల్యాణ్ తో కలిసి సీఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను కోస్తాంధ్ర తీరంవైపు దూసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. తుపాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులను, అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు ఆకస్మికంగా పొంగిపొర్లే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో

మిగతా 2లో

## కబ్జా నుంచి 1.27 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా




**-ప్రజావాణిలో ఫిర్యాదుల ఆధారంగా ఆక్రమణల తొలగింపు**

హైదరాబాద్ నగరంలో హైడ్రా పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించింది. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు, సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలిన అనంతరం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా, సరూర్ నగర్ మండలం, కర్మన్‌ఘాట్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కును కబ్జా చేశారంటూ స్థానిక అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. లే అవుట్‌లో పార్కు స్థలంగా చూపించి, ఆ

మిగతా 2లో

# నలువైపులా నాలుగు వివాదాలు

## -రచ్చకెక్కిన మంత్రుల తీరు, తలపట్టుకుంటున్న హైకమాండ్



హైదరాబాద్ తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొద్ది నెలల్లోనే అంతర్గత కుమ్ములాటలు బయటపడుతున్నాయి. మంత్రులు, కీలక నేతలు బహిరంగంగా కామెంట్స్ చేసుకోవడం హైకమాండ్‌కు తలనొప్పిగా మారింది. తెలంగాణ కాంగ్రెస్‌లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉందా? అన్న చర్చ ఇప్పుడు సాగుతోంది. ఇందుకు ఇటీవల జరిగిన వరుస సంఘటనలే కాంగ్రెస్ పార్టీ తీరును బయటపెడుతున్నాయి.

1. కొండా సురేఖ, పొంగులేటి వివాదం - బీసీ వర్సెస్ రెడ్డి వివాదంగా

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య వివాదం కాంగ్రెస్‌లో సంచలనంగా మారింది. బీసీ మంత్రిగా కొండా సురేఖ, రెడ్డి సామాజిక వర్గం మంత్రిగా పొంగులేటి మధ్య వివాదంగా ఇది రూపుదిద్దుకుంది. తన శాఖలోని పనులకు టెండర్లను తమ వారిని కాదని, మంత్రి పొంగులేటి తన మనుషులకు ఎలా ఇప్పించుకుంటారని, ఈ జోక్యం తగదన్నది కొండా సురేఖ వాదనగా ఉంది. ఈ విషయంలో ఇరు మంత్రుల మధ్య తలెత్తిన వివాదం రాజుకుని పార్టీలో బీసీ, రెడ్డి వర్గాల మధ్య సంఘర్షణగా మారింది. బీసీ మంత్రి అయిన తనను కొందరు రెడ్డి మంత్రులు పదవి నుంచి తొలగించడానికి కుట్రలు పన్నుతున్నారని మీడియా చిట్ చాట్‌లో కొండా సురేఖ చెప్పడం సంచలనం సృష్టించింది. దీంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో హైకమాండ్ తలపట్టుకుంటోంది. ఇలా క్యాబినెట్ మంత్రుల మధ్య పోరు ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్‌ను పలుచన చేసే పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు, టెండర్లలో మంత్రుల జోక్యం ఈ వివాదం వల్ల బహిర్గతమైంది (లేదా బహిర్గతం అవుతోంది).

2. కొండా సురేఖ - సీఎం రేవంత్ రెడ్డి వివాదం - సీఎంకు అంటుకున్న ఆరోపణలు

కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌ను జూబ్లీహిల్స్‌లోని కొండా సురేఖ ఇంటి వద్ద అరెస్టుకు పోలీసులు ప్రయత్నించడం, ఈ అరెస్టును కొండా సురేఖ కుమార్తె సుష్మిత అడ్డుకోవడం పెద్ద వివాదానికి

మిగతా 2లో



## సాక్షులను బెదిరిస్తే ఇకపై నేరుగా ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ కేసుల్లో సాక్షులను బెదిరించడంపై సుప్రీంకోర్టు మంగళవారం ఒక చారిత్రక తీర్పు వెలువరించింది. తప్పుడు సాక్ష్యం ఇవ్వాలంటూ సాక్షులను బెదిరించడం (ఐపీసీ సెక్షన్ 195ఏ) కాగ్నిజబుల్ నేరమని స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలపై పోలీసులు కోర్టు నుంచి ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అవసరం లేకుండానే నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేపట్టవచ్చని తేల్చిచెప్పింది. జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. "ఐపీసీ సెక్షన్ 195ఏ కింద నమోదయ్యే నేరం కాగ్నిజబుల్ అయినప్పుడు, సీఆర్పీసీ సెక్షన్ 154, 156 కింద చర్యలు తీసుకునే పోలీసుల అధికారాన్ని శంకించలేం" అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఈ అంశంపై కేరళ ప్రభుత్వం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లను విచారించిన అనంతరం ఈ తీర్పు ఇచ్చింది. గతంలో ఇలాంటి కేసుల్లో కోర్టు నుంచి ఫిర్యాదు తప్పనిసరి అని పేర్కొంటూ కేరళ, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఐపీసీ సెక్షన్ 195ఏ (2006లో చేర్చారు) అనేది సెక్షన్ 193 నుంచి 196 వరకు ఉన్న ఇతర నేరాల కంటే భిన్నమైనదని, ప్రత్యేకమైనదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. "ఒక సాక్షి కోర్టుకు రాకముందే, చాలా కాలం ముందే బెదిరింపులు ఎదుర్కోవచ్చు. బాధితుడైన సాక్షి లేదా ఇతరులు వెంటనే పోలీసులను ఆశ్రయించడానికి వీలుగానే ఈ నేరాన్ని కాగ్నిజబుల్‌గా వర్గీకరించారు" అని ధర్మాసనం వివరించింది. అంతేకాకుండా, సీఆర్పీసీలోని సెక్షన్ 195ఏ (2009లో చేర్చారు) బాధితులకు మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు

మిగతా 2లో



## మరో ఇద్దరు నక్సల్ కీలక నేతల సరెండర్

**-ప్రజలతో కలిసి పని చేస్తామన్న చంద్రన్న, బండి ప్రకాష్**

హైదరాబాద్ తెలంగాణ డీజీపీ ముందు మావోయిస్టు కీలక నేతలుప్రసాదరావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ సరెండర్ అయ్యారు. మావోయిస్టు లొంగుబాటులో తెలంగాణ ఎస్ఐబీ కీలక ఆపరేషన్ నిర్వహిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు చంద్రన్న అజ్ఞాతం వీడారు. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. చంద్రన్న కేంద్ర కమిటీలో కీలక సభ్యుడిగా పనిచేశారు.

**సీఎం రేవంత్ పిలుపు మేరకు లొంగిపోయాము**

అనారోగ్య పరిస్థితులు, ఆపరేషన్ కగార్ వల్ల తాము లొంగిపోయామని మావోయిస్టులు చెప్పారు. రేవంత్ సూచనాలతోనే జనజీవన

## హాలివుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా



**-సినిమా టిక్కెట్ రేట్ల పెంపుపై సీఎం సంచలన ప్రకటన**

**-కార్మికులకు వాటా ఇస్తేనే ఇక జీవో అన్న సీఎం రేవంత్**

హైదరాబాద్ తెలుగు చిత్ర పరిశ్రమ భవిష్యత్తుపై, సినీ కార్మికుల సంక్షేమంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు చేశారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సినీ కార్మికులు

మిగతా 2లో




## మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్ లో కీలక ముందడుగు

734.07 ఎకరాల భూమి బదలాయింపు

## జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు సమీక్ష

**-గత ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చనున్న కూటమి సర్కారు**



## బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయండి

**-అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**



## ఎనిమిదో వేతన సంఘానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

**-10 నెలల నిరీక్షణకు తెర**



దిన పత్రిక
తొలి సమయం
బుధవారం 29 అక్టోబర్2025

# నలువైపులా నాలుగు వివాదాలు

దారి తీసింది. దక్కన్ సిమెంట్ కంపెనీ యాజమాన్యాన్ని గన్‌తో సుమంత్ బెదిరించారన్నది పోలీసుల ఆరోపణ. దీనిపై మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారని, సీఎం ఆదేశాల మేరకు అధికారులు సుమంత్‌ను ఓఎస్‌డీ పదవి నుంచి తొలగించడం జరిగింది. అంతే కాకుండా పోలీసులు కొండా సురేఖ ఓఎస్‌డీ సుమంత్‌ను మంత్రి ఇంటి వద్దే అరెస్టు చేసేందుకు వెళ్లడం వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లయింది. ఈ సందర్భంగా కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత సీఎంపై చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. గన్ బెదిరింపు విషయంలో సీఎం సన్నిహితుడు రోహిన్ రెడ్డి ఉన్నారని, ఆయనకు సీఎం గన్ ఇచ్చి పంపారని సుష్మిత ఆరోపణలు చేశారు. అంతే కాకుండా సీఎం సోదరులు భూదందాలు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. దీంతో హైకమాండ్ రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏకంగా సీఎంపై క్యాబినెట్ మంత్రి కూతురు ఇలాంటి ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. ఈ వివాదం పరిష్కారం అయినప్పటికీ సుష్మిత చేసిన ఆరోపణలు ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఓ మచ్చగా మారాయి. క్యాబినెట్ మంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. తొలగిస్తే బీసీ మంత్రిని తొలగించారన్న అపవాదు కాంగ్రెస్ సర్కార్‌పై పడి ఉండేది. ఇక ఏం చేయలేని పరిస్థితుల్లో కొండా సురేఖ క్షమాపణలతో ఈ వివాదం ముగిసింది. అయినా గన్ పెట్టిన కేసు వివాదం తేలలేదు. సీఎంపై ఆరోపణల్లో వాస్తవాలు ఎంత అన్న దానిపై క్లారిటీ లేదు. ఇవన్నీ ఇప్పుడు ప్రజల్లో ప్రశ్నలుగా మిగిలిపోయాయి. ఇవి ఇప్పుడు ప్రతిపక్షాలకు అస్త్రాలుగా మారాయి.

3. పొన్నం – అడ్లూరి వివాదం – మాదిగ సామాజిక వర్గాన్ని కించపర్చారన్న ఆరోపణలు

కొండా వివాదం బీసీల రంగు పూసుకుంటే, ఇక మంత్రులు పొన్నం ప్రభాకర్ – అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల మధ్య వాగ్వాదం మాదిగ సామాజిక వర్గం కినుక వహించేలా చేసింది. ఓ సమావేశంలో పొన్నం ప్రభాకర్ మంత్రి అడ్లూరిని అనుచితంగా సంబోధించారని ఆరోపణలు వచ్చాయి. దానికి సంబంధించిన వీడియో హల్ చల్ చేసింది. అయితే దీంతో పొన్నం బేషరతుగా క్షమాపణ చెప్పాలని, తను మాదిగ సామాజిక వర్గం నుంచి మంత్రి అయ్యాను కాబట్టే అలా విలువ లేకుండా మాట్లాడుతున్నారని అడ్లూరి డిమాండ్ చేయడం జరిగింది. అయితే తాను తన సిబ్బందిని సంబోధించానే తప్ప, మంత్రి అడ్లూరిని కాదని పొన్నం వివరణ ఇచ్చారు. అయినా దీనికి మంత్రి అడ్లూరి, ఆయన మద్దతుదారులు, మాదిగ సామాజిక వర్గ సంఘాలు మాత్రం సంతృప్తి చెందలేదు. ఈ పరిస్థితుల్లో హైకమాండ్ జోక్యం చేసుకుంది. సీఎం రేవంత్ సూచనల మేరకు దీనిపై మంత్రి పొన్నం విచారం వ్యక్తం చేస్తూ మీడియా ప్రకటన విడుదల చేయడం జరిగింది. అయినప్పటికీ మంత్రి అడ్లూరి మాత్రం తనకు క్షమాపణ చెప్పకుండా విచారం వ్యక్తం చేయడం ఏంటని బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ పెద్దల సూచనల మేరకు ఇష్టం లేకున్నా అడ్లూరి ఈ వివాదాన్ని ముగించారు. అయితే ఈ ఉదంతం క్యాబినెట్‌లో మంత్రుల మధ్య సయోధ్య లేదన్న అంశాన్ని రూఢీపరుస్తోంది. సామాజిక వర్గాల వారీగా విడిపోయారా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేస్తాయన్న ఆందోళనలో హైకమాండ్ ఉంది.

4. మంత్రి జూపల్లి – సీఎం రేవంత్ రెడ్డి వివాదం – ఇది ఓ నిశ్శబ్ద యుద్ధం

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి మధ్య అంతర్గతంగా విభేదాలు ఉన్నాయన్న వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. మద్యం బాటిళ్లపై అంటించడానికి ఈ హోలోగ్రామ్ లేబుల్స్‌ను ఉపయోగిస్తారు. హై-సెక్యూరిటీ హోలోగ్రామ్ లేబుల్స్ వేయాల్సి ఉంటుంది. నకిలీ మద్యం, అక్రమ మద్యం రవాణా మరియు ఎక్సైజ్ పన్ను ఎగవేతలను అరికట్టడానికి ఈ లేబుల్స్‌లో బార్‌కోడ్, ఐటీ ట్రాకింగ్ సిస్టమ్ వంటి భద్రతా అంశాలు ఇందులో ఉంటాయి. దీనికి సంబంధించిన 500 కోట్ల విలువైన టెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అల్లుడికి ఇప్పించాలని ప్రయత్నించారని, జూపల్లి తన కొడుకుకు ఆ టెండర్లు దక్కాలని ప్రయత్నించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు చేయడం గమనార్హం. ఈ విషయంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ నలిగిపోయారని ఈ క్రమంలోనే ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారన్న వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే రిజ్వీ వీఆర్ఎస్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే తన శాఖలో తన ఆదేశాలు పాటించకుండా ప్రభుత్వానికి నష్టం చేసిన రిజ్వీపై చర్య తీసుకోమని ప్రభుత్వానికి సిఫారసు చేసినా పట్టించుకోకుండా ఎలా వీఆర్ఎస్ ఇస్తారని మంత్రి జూపల్లి ప్రభుత్వాన్నే ప్రశ్నించడం విశేషం. ఈ వివాదం వల్ల ప్రభుత్వ పనుల్లో సీఎం, మంత్రులు, వారి కుటుంబ సభ్యుల జోక్యం వల్ల అధికారులు ఇబ్బందులు పడుతున్నారన్న చర్చ సాగుతోంది. టెండర్లలో సీఎం- మంత్రుల జోక్యం అనే ఆరోపణలు ఇప్పుడు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నాయి. ఇది ప్రతిపక్షాలకు కాంగ్రెస్ సర్కార్‌పై దాడి చేసేందుకు పదునైన అస్త్రంగా మారింది. మరో వైపు మంత్రి జూపల్లి సైతం ఆయా శాఖల్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తెప్పించుకుంటున్నారని సచివాలయంలో చర్చ సాగుతోంది. ఈ పరిస్థితి కాంగ్రెస్ హైకమాండ్‌కు చిక్కులు తెచ్చిపెడుతోందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకుంటున్నాయి.

**ఇంటి పోరు నియంత్రణే హైకమాండ్ ఆలోచన**

గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినంత మాత్రాన పార్టీలో నేతల మధ్య పూర్తి సమన్వయం లేదని, విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయని పై ఉదంతాలు రుజువు చేస్తున్నాయి. మంత్రుల మధ్య ఈ అంతర్గత పోరు, విమర్శలు, ఆరోపణలు ప్రతిపక్షాలకు ప్రధానాస్త్రాలుగా మారుతున్నాయి. వీటిపై తక్షణం చర్యలు తీసుకోకపోతే ఇది పార్టీకి తీవ్ర నష్టం చేస్తుందన్న ఆలోచనలో కాంగ్రెస్ హైకమాండ్ ఉంది. తక్షణ నష్ట నివారణకు హైకమాండ్ ప్రయత్నిస్తోంది. గొడవలు సద్దుమణిగేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగమే సీఎం రేవంత్‌కు కొండా సురేఖ బహిరంగ క్షమాపణ, అడ్లూరి వివాదం విషయంలో మంత్రి పొన్నం వివరణ– విచారం వ్యక్తం చేయడం వంటివి జరిగాయి. అయితే మంత్రుల మధ్య వ్యక్తిగత ఆధిపత్య విభేదాలు ముదిరితే రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇబ్బందులు తప్పవని హైకమాండ్ గ్రహించిందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లోగా ఈ పరిస్థితిని తమ నియంత్రణలోకి తెచ్చుకునే ప్రయత్నాలు ప్రారంభించిందని, అందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి, ఇతర ముఖ్య నేతల ఢిల్లీ పర్యటన అని కాంగ్రెస్ సీనియర్లు చెబుతున్నారు. అయితే ఈ పరిస్థితిని అదుపు చేయడం మాత్రం హైకమాండ్‌కు కత్తిమీద సాములాంటిదేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

# ఏపీ వ్యాప్తంగా మొంథా ప్రభావం

కలిసి మొంథా తుపాను ప్రభావం, ప్రభుత్వ సన్నద్ధతపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**తీరం దాటే ప్రాంతంపై ప్రత్యేక దృష్టి**

ప్రస్తుతం మొంథా తుపాను అత్యంత వేగంగా తీరానికి సమీపిస్తోందని, ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నం సహా పలు తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, తుపాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు తక్షణమే మరిన్ని ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించాలని ఆదేశించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యంత్రసామాగ్రి, కమ్యూనికేషన్ పరికరాలు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గడచిన అనుభవాలను, ముఖ్యంగా హుద్‌హుద్ తుపాను సృష్టించిన విధ్వంసాన్ని గుర్తుచేసుకుంటూ, అప్పటి స్ఫూర్తితో కేవలం నాలుగు రోజుల్లోనే ప్రజలను గట్టెక్కించామని, అదే పట్టుదలతో ఇప్పుడు పనిచేయాలని పిలుపునిచ్చారు.

**క్షేత్రస్థాయిలో పక్కా సమాచారం ఉండాలి**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎంత విస్తీర్ణంలో నీరు నిలిచింది, ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో కచ్చితమైన అంచనాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నందున ఎర్రకాలువకు ఎగువ నుంచి ఆకస్మిక వరద ప్రవాహం వచ్చే ప్రమాదం ఉందని, ఆ ప్రాంతంలో అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

**డ్రోన్లతో పర్యవేక్షణ, తక్షణ పునరుద్ధరణ**

తుపాను ప్రభావంతో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 43 వేల హెక్టార్లలో పంట నీట మునిగిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నష్టం ఎక్కువగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా పంట నష్టం వివరాలను రైతులు నేరుగా ప్రభుత్వానికి పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్‌లో మార్పులు చేయాలని సీఎం సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాలను, గాలుల కారణంగా కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, టవర్లను గుర్తించి తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి మొబైల్ ఫోన్ల ద్వారా హెచ్చరిక సందేశాలు పంపామని, 2,703 జనరేటర్లను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం పోలీస్ శాఖ 81 టవర్లతో వైర్‌లెస్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని వివరించారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తుపాను కారణంగా రోడ్లపై చెట్లు, స్తంభాలు కూలిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో తాను ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నానని, యంత్రాంగమంతా క్షేత్రస్థాయిలో ఉందని మంత్రి నారా లోకేశ్ సీఎంకు తెలిపారు. రాయలసీమలో ప్రస్తుతం వర్షాలు లేనందున కృష్ణా నది ప్రవాహాలను అక్కడి చెరువులకు మళ్లించి, ఒక్క టీఎంసీ నీటిని కూడా వృథా చేయవద్దని జలవనరుల శాఖ అధికారులకు చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మరో ఇద్దరు నక్సల్ కీలక నేతల సరెండర్

ప్రవంతిలోకి వస్తున్నామన్నారు. అయితే ఇది లొంగుబాటు కాదు, రాబోయే రోజుల్లో ప్రజల కోసమే వస్తున్నామని స్పష్టం చేశారు. తాము ఎలాంటి డబ్బులు ఆశించడం లేదన్నారు. చాలా మంది చనిపోయారు మా సిద్ధాంతం మేరకు ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు.

**మావోయిస్టు పార్టీలో చీలికలు**

మావోయిస్టు పార్టీలో అంతర్గత చీలికలు జరిగాయని సరెండర్ నక్సలైట్లు తెలిపారు. దేవోజీ సీపీఐ మావోయిస్టు కార్యదర్శిగా ఉన్నారు, ఎవరి మార్గం వాళ్ళు ఎంచుకున్నారు, మేము ఎంచుకున్నామని బండి ప్రకాష్, చంద్రన్న తెలిపారు. సోని వర్గం మమ్మల్ని వ్యతిరేకేస్తోందని మాకు కూడ ప్రజాల మధ్య పనిచేసే క్యాడర్ ఉంది. దేశమంతా పనిచెయ్యడానికి ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశామని, భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తామని తెలిపారు. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించడం ఎవరితరం కాదని వారు తెలిపారు. మా భావాజాలంతో భవిష్యత్తులో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉందని, ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నామన్నారు. ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చామని తెలిపారు.

**అందరూ సరెండర్ కావాలని డీజీపీ పిలుపు**

చంద్రన్నా, బండి ప్రకాశ్ అజ్ఞాతం వీడారని.. తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు అజ్ఞాతం నుండి బయటికి వచ్చి జనజీవన ప్రవంతి లో కలిశారని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. పుల్లూరి ప్రసాద్ రావ్ ఏ చంద్రన్నా ది పెద్దపల్లి మండలం, 15 ఏళ్ల కేంద్ర కమిటీ సభ్యుడి గా ఉన్నాడు. మొదట రాడికల్ స్టూడెంట్ గా తన ప్రస్థానాన్ని స్టార్ట్ చేశాడు . 1980 లో కిషన్ జీ కి కొరియర్ గా చేశాడు. 2008 లోనే కేంద్ర కమిటీ మెంబర్ గా చంద్రన్న ఉన్నాడు.

2024 డిసెంబర్ వరకు తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీ గా ఉన్నాడని డీజీపీ తెలిపారు. అక్టోబర్ 21 నాడు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రన్న జన జీవన ప్రవంతి లో కలిశాడని చంద్రన్నా ఆరోగ్యం కూడా సహకరించకాపోవడం తో అజ్ఞాతం వీడారన్నారు.

# మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్ లో కీలక ముందడుగు

హైదరాబాద్ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. మూసీ నది సుందరీకరణ, అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా 734.07 భూమిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్డీసీఎల్) కు బదలాయించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ నిర్ణయంతో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్(ఎంఆర్డీపీ) పనులు మరింత వేగవంతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బదలాయించే భూములు రంగారెడ్డి జిల్లాలోని నాలుగు మండలాల్లో విస్తరించి ఉన్నాయి. హిమాయత్ సాగర్ లోని ఈసా నది వద్ద, గండిపేట మండలంలోని కిస్మత్ పూర్, రాజేంద్రనగర్ మండలంలోని ప్రేమావతి నగర్, బద్వేల్, శంషాబాద్ మండలంలోని కొత్వాల్ గూడలో హెచ్ ఎండీ ఏ లే అవుట్ ల కోసం కేటాయించిన ఈ భూములను బదలాయించారు.

మూసీ నది సుందరీకరణతోపాటు రివర్ ఫ్రంట్ కారిడార్ అభివృద్ధిని చేపట్టనుంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ క్రమంలో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) కు 734.07 ఎకరాల భూమిని బదలాయిస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.అలాగే పలు ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన భూములను సైతం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) కు బదలాయించారు. టీఈఈఆర్ ఎల్(129.39 ఎకరాలు), ఐఐపీహెచ్(41.27ఎకరాలు), వాలంతరి(219.09 ఎకరాలు) వంటి సంస్థలకు కేటాయించిన భూములతో పాటు, శంషాబాద్ మండలం కొత్వాల్ గూడలో హెచ్‌ఎండీఏ లేఅవుట్ కోసం కేటాయించిన భూమిని కూడా మూసీ ప్రాజెక్టు కోసం బదలాయించారు. ఇక భూములు కోల్పోయిన సంస్థలకు ఫ్యూచర్ సిటీ, శంషాబాద్ మండలంలో ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక మూసీ సుందరీకరణ, అభివృద్ధి కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి రూ. 4,100 కోట్ల రుణం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిన విషయం తెలిసిందే. ఇక మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్(ఎంఆర్డీపీ) లో భాగంగా మూసీ నదిలో పేరుకుపోయిన చెత్తను తీసి పూడికలు తీసి శుభ్రం చేయడం మూసీ నదికి రెండు వైపులా 110 కిలోమీటర్లు మేర అభివృద్ధి చేస్తారు. అలాగే ప్రాజెక్ట్ లో భాగంగా నదికి రెండు వైపులా రోడ్లు, సైకిల్ ట్రాక్ లు, వాకింగ్ వే లు, పార్కులు, పచ్చని ప్రదేశాలను ఏర్పాటు చేయనుంది.

# ఎనిమిదో వేతన సంఘానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ దాదాపు కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు గుడ్ న్యూస్. కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఎనిమిదో వేతన సంఘాన్ని అధికారికంగా ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. ఎన్సీ – జీసీఎం (స్టాఫ్ సైడ్) సెక్రటరీ శివ గోపాల్ మిశ్రా మాట్లాడుతూ, ఎనిమిదవ వేతన సంఘాన్ని అమలు చేయడంలో ఆలస్యం కావచ్చు, కాని ఇది జనవరి 1, 2026 నుంచ అమలులోకి వస్తుంది. అంటే, ఆలస్యం జరిగితే, జనవరి 1, 2026 నుంచి సిబ్బందికి బకాయిలు కలిపి చెల్లించవచ్చు. 10 మిలియన్లకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు పెద్ద వార్త. కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటుకు అధికారికంగా ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాష్ దేశాయ్ కమిషన్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తుండగా, ఐఐఎం బెంగళూరు ప్రొఫెసర్ పులక్ ఘోష్, పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ సభ్యులుగా నియమితులయ్యారు.

**సిఫార్సులు పంపడానికి 18 నెలల సమయం**

కమిషన్ రాబోయే 18 నెలల్లో ప్రభుత్వానికి తన సిఫార్సులను సమర్పిస్తుంది, ఆ తర్వాత 2027 నుంచి జీతం, పెన్షన్ పెంపుదల అమలు చేయవచ్చు. ఎనిమిదో వేతన సంఘం కోసం నిబంధనలను ఆమోదించినట్లు క్యాబినెట్ సమావేశం తర్వాత విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో పేర్కొంది. వేతన సంఘంలో చైర్మన్, సభ్యుడు (పార్ట్–టైమ్), సభ్య కార్యదర్శి ఉంటారు. వేతన సంఘం ఏర్పడినప్పటి నుంచి పద్దెనిమిది నెలల పాటు దాని సిఫార్సులను సమర్పించడానికి సమయం ఇచ్చారు. 8వ వేతన సంఘం అమలులో జాప్యం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, అది జనవరి 1, 2026 నుంచి అమలులోకి వస్తుందని ఎన్సీ – జీసీఎం (స్టాఫ్ సైడ్) కార్యదర్శి శివ్ గోపాల్ మిశ్రా చెబుతున్నారు. దీని అర్థం ఆలస్యం అయితే, జనవరి 1, 2026 నుంచి బకాయిలను జోడించి సిబ్బందికి చెల్లించవచ్చు.

**2027లో బకాయిలతో జీతం పెంపు!**

గతంలో, ఏడో వేతన సంఘం అమలు చేసినప్పుడు, ఆలస్యం జరిగింది. అన్ని ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయిలు చెల్లించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు ప్రాతినిధ్యం వహించే ఫోరమ్ అయిన ఎన్సీ – జీసీఎం జనవరిలో కేంద్ర ప్రభుత్వానికి ఒక నిబంధనలను సమర్పించింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఇతర అంశాల దృష్ట్యా, ప్రతి 10 సంవత్సరాలకు ఒక కొత్త వేతన సంఘం ఏర్పడుతుందని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, భత్యాలు, ఇతర ప్రయోజనాలను సవరిస్తున్నారని గమనించాలి. దీని ప్రకారం, ఎనిమిదవ వేతన సంఘం జనవరి 1, 2006 నుంచి అమలులోకి వస్తుంది. ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటును ఈ సంవత్సరం జనవరిలో ప్రకటించారు, కానీ కేంద్ర మంత్రివర్గం నుంచి ఆమోదం పొందడానికి దాదాపు 10 నెలలు పట్టింది. ఈ ఆలస్యం ప్రభుత్వ ఉద్యోగులు మరియు వారి సంఘాలలో అసంతృప్తి స్వరాలకు దారితీసింది.

## సాక్షులను బెదిరిస్తే ఇకపై నేరుగా ఎఫ్ఐఆర్

చేసుకునే అవకాశాన్ని ఒక అదనపు పరిహార మార్గంగా మాత్రమే కల్పిస్తోందని స్పష్టం చేసింది. అందులో వాడిన 'చేయవచ్చు' (మే) అనే పదం, బాధితులు కేవలం మేజిస్ట్రేట్‌ను మాత్రమే ఆశ్రయించాలనే నిబంధన తప్పనిసరి కాదని సూచిస్తోందని పేర్కొంది.

ఈ తీర్పుతో, 2023 ఏప్రిల్ 4 నాటి కేరళ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. నిందితుడిని రెండు వారాల్లోగా ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. అయితే, ఇతర కారణాలపై బెయిల్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అతడికి అవకాశం ఉందని స్పష్టం చేసింది. అదేవిధంగా, యోగేష్ గౌడర్ హత్య కేసుకు సంబంధించి సీబీఐ ఫిర్యాదుపై ధార్వాడ్ మేజిస్ట్రేట్ 2020లో జారీ చేసిన ఆదేశాలను పునరుద్ధరించింది. ఈ కేసును కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఈ విషయంలో కేరళ, కర్ణాటక హైకోర్టుల వ్యాఖ్యానాలు "తప్పులతో కూడినవి, నిలకడలేనివి" అని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

## హాలివుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా

ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలుగు సినిమాను ప్రపంచ సినిమాకు కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగు చిత్ర పరిశ్రమ చరిత్రను గుర్తు చేస్తూ పరిశ్రమ అభివృద్ధికి గత నాయకులు చేసిన కృషిని కొనియాడారు. ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమను 'మదరాసి' అని పిలిచేవారని ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ఈ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించడానికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి దిగ్గజ నటుల సహకారంతోనే పరిశ్రమ హైదరాబాద్‌లో స్థిరపడిందని తెలిపారు. కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే తక్కువ ధరకే భూములు ఇచ్చారని అలాగే నంది అవార్డుల కార్యక్రమాన్ని 1964లో ప్రారంభించారని గుర్తు చేస్తూ చిత్రపురి కాలనీ అభివృద్ధిలో నాటి నాయకుల కృషిని మర్చిపోకూడదని చెప్పారు.

**సినీ కార్మికుల సంక్షేమం..**

తెలుగు సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతూ ఆస్కార్ స్థాయికి ఎదుగుతోందంటే దాని వెనుక సినీ కార్మికుల కృషి ఎంతో ఉందని సీఎం ప్రశంసించారు. తనకు సినీ కార్మికుల కష్టాలు తెలుసని వారిని పట్టించుకోనంత స్థాయికి తాను ఇంకా వెళ్లలేదని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. నటుడు ప్రభాకర్ రెడ్డి కార్మికుల కోసం తన సొంత 10 ఎకరాల భూమిని ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. తమ ప్రభుత్వ లక్ష్యం 'ప్రపంచ సినిమాకు హైదరాబాద్ కేరాఫ్ కావాలి' అని స్పష్టం చేశారు. సినీ కార్మికులు అండగా ఉంటే హాలీవుడ్‌ను కూడా హైదరాబాద్‌కు తీసుకొస్తామని ఆయన ధైర్యం చెప్పారు. సినీ పరిశ్రమ కోసం ఫ్యూచర్ సిటీలో స్థలాల కేటాయింపు, కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలల నిర్మాణం వంటి కీలక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గద్దర్ అవార్డులను ప్రారంభించామని తెలిపారుద

## జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి ఏపీలో ప్రస్తుతం ఉన్న జిల్లాలను పునర్ వ్యవస్థీకరించి కొత్త జిల్లాల ఏర్పాటు కోసం ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ సీఎం చంద్రబాబుతో సమావేశమైంది. ఆయనకు జిల్లాల్లో పర్యటనలు, ఇతర మార్గాల్లో సేకరించిన వివరాలను అందించింది. అలాగే కొత్త జిల్లాలపై ఉన్న డిమాండ్లు, ఇతర పరిస్థితుల్ని కూడా వివరించింది. అనంతరం సీఎం చంద్రబాబు కొత్త జిల్లాల ఏర్పాటుపై వారికి క్లారిటీ ఇచ్చేశారు.

రాష్ట్రంలో చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో ప్రజల ఆకాంక్షలు నెరవేరి, పరిపాలనా సౌలభ్యం కలగాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని సీఎం చెప్పారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఈ ఏడాది జూలై 22న ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సీఎం చంద్రబాబుతో భేటీ అయింది. వీరితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఉన్నారు.గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటును సరిదిద్దేలా జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైనా, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపైనా సీఎం చర్చించారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ప్రాంతీయ విభేదాలకు కారణమైందని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు భవిష్యత్‌లో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరగాలని నిర్దేశించారు. రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణను ప్రత్యేకంగా చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పోలవరం పూర్తయిన తర్వాత ముంపు మండలాల ప్రజలు ఏ రెవెన్యూ వార్డు, ఏ నియోజకవర్గంలో ఉంటారనేదానిపైనా అధ్యయనం చేసి దానికి అనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ జరపాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆ ప్రాంత చిరకాల వాంఛ అని సీఎం ప్రస్తావించారు. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను, ఆయా వర్గాల అభిప్రాయాలను మంత్రులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై తొలి సమావేశంలో పలు అంశాలు చర్చించిన సీఎం ప్రతిపాదనలపై తదుపరి చర్చలకు వారంలో మరోసారి సమావేశం అవుదామని తెలిపారు.

## బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయండి

హైదరాబాద్ తెలంగాణలోని నీటి పారుదల ప్రాజెక్టులన్నింటిపైనా సమగ్రమైన అధ్యయనం పూర్తి చేసి నివేదికలను తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వారిగా విశ్లేషణలు జరగాలని స్పష్టంగా చెప్పారు. వివరాలు 'కాంప్రహెన్సివ్ డ్యామ్ సేఫ్టీ ఎవల్యూషన్' (సీడీఎస్ఈ) కు సంబంధించి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల రాసిన లేఖపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ లేఖలో ప్రస్తావించిన అంవాలను ఈ సమావేశంలో చర్చించారు. అందుకు అనుగుణంగా ప్రాజెక్టుల వారిగా సమగ్రమైన వివరాలతో విశ్లేషణలు జరగాలని, రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపైనా స్టేటస్ రిపోర్ట్‌లను తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు చెప్పారు. ప్రాజెక్టుల వారీగా రూపొందించే పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు.

తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించడానికి వీలుగా ప్రాజెక్టుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై సమీక్షలో చర్చించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించే విధంగా ఈ ప్రణాళికలు సిద్ధం కావాలని చెప్పారు. ఇందుకు పాత పనులను ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లేందుకు వీలుగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల బ్యారేజ్ మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని కూడా అధికారులను ఆదేశించారు.

## కబ్జా నుంచి 1.27 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారిణ జరిపి ఆక్రమణలను తొలగించారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఆక్రమణకు గురికాకుండా కాపాడినట్లు తెలియజేస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అదేవిధంగా, శేరిలింగంపల్లి జోన్, చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్ నగర్ పేరుతో 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లే అవుట్ వేసింది. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. పేద ప్రజల కోసం ఉద్దేశించిన లే అవుట్‌లో కొందరు బడాబాబులు ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాటుగా మార్చారు. ఈ ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

# పండితాపురం లో ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేస్తున్న మల్లి బాబు యాదవ్.



తొలి సమయం, పండితాపురంఅక్టోబర్, 28. తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు పొంగులేటి ముఖ్య అనుచరుడు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పొంగు లేటి అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ పొంగులేటి శ్రీనన్న అభిమానులకు ఈరోజు ఒక పండుగ రోజు అని, పుట్టినరోజులు అందరికీ వస్తాయి, సంవత్సరాలు క్యాలెండర్లు మాత్రమే మారుతుంటాయని, పుట్టినందుకు జీవితంలో ఏదైనా సేవ చేయాలని తపన పడేవాళ్లు కొంతమంది మాత్రమే ఉంటారని, అలాంటి వ్యక్తుల జాబితాలో మన పొంగులేటి శ్రీనన్న నాకు ఆపద ఉందని పిలిస్తే ఎక్కడ ఉన్నా మనకు ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని సహాయం చేసే వ్యక్తి అని, అభివర్ణించారు. ప్రజల కోసం నిత్యం శ్రమిస్తూ, చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి వ్యక్తిని గుర్తుపట్టి పలకరించుకుంటూ క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఎవరికి ఏమి కావాలో తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించుకుంటూ ముందుకెళ్తే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు పొంగులేటి అని, నేడు మంత్రిగా ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తూ గతంలో ఎవరు చేయలేని విధంగా భూ సంస్కరణలు చేపట్టి ప్రతి యజమానికి భూమిపై శాశ్వతమైన హక్కు కల్పించే విధంగా సంచలనమైన నిర్ణయాలు తీసుకున్నారని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇల్లు లేని పేదలను గుర్తించి 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ ఎక్కడ అవినీతికి ఆస్కారం లేకుండా, ఎవరికి డబ్బులు ఇవ్వకుండా ప్రతి సోమవారం ఇండ్ల యొక్క స్థితిని బట్టి డైరెక్ట్ గా ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు వేయడం జరుగుతుందని, ఒక మంత్రి గానే కాకుండా ఒక మహా వ్యక్తిగా దమ్ము ధైర్యం ఉన్న కీర్తిశేషులు దివంగత నేత డాక్టర్ వైయస్సార్ తర్వాత ఇలాంటి వ్యక్తిని చూస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ పతే మహమ్మద్, బానోతు నరసింహ నాయక్, మేకపోతుల మహేష్ జక్కంపూడి వెంకటేశ్వర్లు అంబడిపూడి సత్యం, మేకల మల్లికార్జునరావు ఎస్ కే రబ్బానీ పాషా, మేకల మహేష్ బాబుశీలం పుల్లయ్య, గుగులోత్ రవి దే రంగుల తిరపయ్య రాయల నాగ శంకర్, చల్ల మల్లయ్య, భూక్య నాగేంద్రబాబు పాడబండ్ల ప్రసాదు, బండి లక్ష్మీనర్సు, బండి ఉపేందర్, చల్ల పెద్ద మల్లయ్య, బండి ఎల్లయ్య, జలగం శ్రీను, మేకల లక్ష్మీనారాయణ, బానోతు లక్ష్మ చింతల వెంకటేశ్వర్లు, బొడ్డు లక్ష్మీనారాయణ తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## ఇల్లందు పట్టణంలో పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు




తొలి సమయం, ఇల్లందుఅక్టోబర్, 28. ఇల్లందు పట్టణంలో ఘనంగా రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను పిఎస్ఆర్ గణేష్ ఆధ్వర్యంలో, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఎస్ఆర్ గణేష్ మాట్లాడుతూ, రైతు కుటుంబంలో జన్మించి ప్రజల ఆధారాభిమానాలతో రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించడం గర్వకారణమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ మనో ధైర్యం కల్పించే గొప్ప మనసున్న నాయకుడు అని అన్నారు. పిఎస్ ఆర్ అభిమానుల నడుమ శాంతికి చిహ్నముగా పావురాని ఎగురవేసీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగ్ నాగేశ్వరరావు, ఎర్రబల్లి రాజశేఖర్, క్రాంతి, రవికుమార్, కొండూరి రాజు, జానకిరామ్, వడ్డేపల్లి భాస్కర్, జానీ, భాష, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్ లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



సుజాతనగర్ తొలి సమయం అక్టోబర్ 28 సుజాతనగర్ మండల పరిధిలో గల నాయకులగూడెం దేగలమడుగు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారులు ఇంటిదగ్గర కేక్ కట్ చేసి మంత్రి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కొత్తగూడెం సొసైటీ అధ్యక్షుడు మండే వీర హనుమంతరావు మరియు సుజాతనగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతలపూడి రాజశేఖర్ ఈ యొక్క కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది

## అసంపూర్తి సి సి రోడ్లు తో అవస్థలు, వనపర్తి 4 వ వార్డ్ కాలని ప్రజలు



తొలి సమయం, వనపర్తి, అక్టోబర్ 28వనపర్తి పట్టణ కేంద్రంలోని నాలుగవ వార్డ్ పెట్రోల్ బంక్ (నియర్ జమ్మి చెట్టు) దగ్గర ఉన్న నూర్ అహ్మద్ నుండి పర్వతాలు గౌడ్ లైన్ రోడ్డు మరియు కటిక సురేష్ నుండి లక్ష్మయ్య ఇంటి వరకు ఉన్న మట్టి రోడ్లను స్థానంలో సిసి రోడ్లను మూడు రోజుల్లో వేస్తామని చెప్పి సంబంధించిన కాంట్రాక్టర్ ఇండ్ల ముందు ఉన్న మెట్లను తొలగించారు 40 ఏం ఏం కంకర రాయి వేసి వదిలేసి పోయారు దాదాపు మూడు నెలలు కావొస్తుంది అయినా కూడా ఇట్టి రెండు రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయి కాలనీలో ఉండే వృద్ధులు, దివ్యాంగులు మరియు చిన్నపిల్లలు కంకర రాళ్లు తగిలి క్రింద పడిపోతున్నారు అదేవిధంగా ఇంటి ముందు ఉన్న మెట్లను తొలగించడం వలన ఇంట్లోకి వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది ఇట్టి విషయాన్ని సంబంధించిన మున్సిపల్ కమిషనర్ గారికి వినతిపత్రం ఇవ్వగా సిసి రోడ్లును సంబంధించిన కాంట్రాక్టర్ చెప్పి వేయిస్తామని చెప్పారు కానీ ఇంతవరకు ఎట్లా ఉందో అదేవిధంగా ఉంది దీనివలన కాలనీ ప్రజలు నడవడానికి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది కావున ఇప్పటికైనా మా కాలనీలో అసంపూర్తిగా 40 ఏం ఏం కంకర వేసి అసంపూర్తిగా వదిలిపెట్టిన రోడ్లను పూర్తిగా చేయాలని ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ యాదయ్య కు కాలనీవాసులు ఫిర్యాదులో అసంపూర్తిగా ఉన్న సిసి రోడ్లను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ను గారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ నాయకులు సూర్యవంశంముని కుమార్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల్ రెడ్డి భౌతిక కాయానికి పూలమాలతో నివాళులు అర్పించిన మంత్రి జూపల్లి.



తొలి సమయం, వనపర్తి, అక్టోబర్ 28చిన్నంబావి మండలం చిన్న మారూర్ గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ తిరుమల్ రెడ్డి హార్ట్ స్ట్రోక్ తో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ నుంచి చిన్నమారూర్ గ్రామానికి విచ్చేసి తిరుమల్ రెడ్డి గ భౌతికకాయానికి పూలమాలతో నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తిరుమల్ రెడ్డి మరణంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న వారి కుటుంబ సభ్యులను మంత్రి జూపల్లి పరామర్శించారు.

## తన్నీరు.సత్యనారాయణ రావు కి గౌరవ నిరంజన్ రెడ్డి నివాళులు.



తొలి సమయం, వనపర్తి, అక్టోబర్ 28మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ కొద్దీ సేపటి క్రితం మరణించారని తెలియడంతో మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హైదరాబాద్ కోకాపేట లో ఉన్న క్రిన్స్ విల్లాస్ లో హరీష్ రావు ఇంటికి వెళ్లి పార్థివ దేహాన్నికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ అకుంఠిత దీక్షతో కుటుంబాన్ని నడిపారని,క్రమశిక్షణ కలిగిన నాయకుణ్ణి తెలంగాణ రాష్ట్రాన్నికి అందించారని కొనియాడారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నందిమల్ల. అశోక్ జిల్లా మీడియా కన్వీనర్

# రాయుతీ పై వ్యవసాయ పనిముట్లు

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల



తొలి సమయం మహబూబాబాద్, అక్టోబర్ 28:జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంకు గాను వ్యవసాయ శాఖలో సబ్ మిషన్ అన్ ఆగ్రికల్చర్ మెకనైజేషన్" (SMAM) పథకం ద్వారా సబ్సిడిలో వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని, ఇందులో బ్యాటరీ స్ప్రేయర్లు - 2496, పవర్ స్ప్రేయర్లు - 452, రోటవేటర్లు - 178. సీడ్ కం ఫర్టి డ్రిల్స్ - 36 డిస్క్ హారో/కల్టివేటర్స్ / కేజ్ వీల్స్ / MB% -ప్లవ్స్ - 222, బండ్ ఫార్మర్స్ - 9, పవర్ వీడర్స్ - 17, బ్రష్ కట్టర్స్ - 33 పవర్ టిల్లర్స్ %-% 25 మరియు స్ట్రా బౌలర్స్ - 29 అందుబాటులో ఉన్నాయని SC, ST మరియు మహిళా రైతులకు 50 శాతం రాయితీతో, మిగితా రైతులకు 40 శాతం రాయితి పై కలవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

కావలసిన పత్రాలు :పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్సీ తో పాటు దరఖాస్తు ఫారం నింపి సంభందిత మండల వ్యవసాయ కార్యాలయంలో సమర్పించి సద్వినియోగం చేసుకోగలరని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలు

**నూతన రైతులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన,**

**-వరికి బదులుగా ఆయిల్ పామ్ సాగు చెయాలి.**

**-వరికి బదులుగా కూరగాయలు సాగు చెయాలి.**

**ఎ-జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్న విస్తీర్ణం**

**-పత్తి, మిరప లో అంతర పంటగా మునగ.లి**

**-బోర్లు, బావులు కింద ఆయిల్ పామ్, ఉద్యాన, మల్బరీ, కూరగాయలు, మునగ వంటి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు %-**

**- ఎకరానికి లక్షన్నర ఆదాయంలి**

**రైతులు పంట నమోదు చేసుకోవాలి, రైతుల అవగాహన కార్యక్రమం**





కేసముద్రం/ మహబూబాబాద్, అక్టోబర్.28:మంగళవారం జిల్లా ఉద్యాన %ు% పట్టుపరిశ్రమ ఆధికారి జినుగు మరియన్న కేసముద్రం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు రైతులు పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న మునగ, కూరగాయలు, ఆకు కూరలు, పూలు, సీతాఫలం, నిమ్మ, జామ, బొప్పాయి, నేరేడు, పనసతో పాటు నూతన పంటలైన అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, గాక్, బోడ కాకర మొదలైన పోషకాలు, ఔషధ గుణాలు ఉన్న వీటిని బోర్లు, బావుల కింద సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు తాము సాగు చేస్తున్న ఉద్యాన, మల్బరీ పంటలను రైతు భరోసా పోర్టల్ లో విస్తరణ అధికారుల ద్వారా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రో ట్రే లో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల వ్యవసాయ అధికారి శ్రీ బానోత్ వెంకన్న, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీ అమరలింగేశ్వర రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధనసరి ముఖ్య కార్యనిర్వహణాధికారి గోపాల మల్లారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ధారావత్ రాజేందర్, ఉద్యాన విస్తరణ అధికారి బొమ్మగాని రమేష్, మండల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# 1/70చట్టం అమలు చెయ్యాలని కలెక్టర్ కార్యాలయం ముందు రిలేనిరాహార దీక్షలు...

తొలి సమయం, భద్రాద్రికొత్త గూడెం అక్టోబర్ 27:జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తుడుం దెబ్బ ఆధ్వర్యంలో 1/70చట్టం అమలు చెయ్యాలని అక్టోబర్ 27 నుండి రిలేనిరాహార దీక్షలు ప్రారంభించినట్లు తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గొగ్గెల రామస్వామి రాష్ట్ర కార్యదర్శి జారే క్రిష్ణ ప్రెస్ నోట్ ద్వారా తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ లో 1/70చట్టం అమలు చేయాలి అని డిమాండ్ చేశారు భూబాదితుల సమస్యలు సత్వరమే పరిష్కారంచేసి, భూమి అప్ప జెప్పాలని అన్నారు ఈ కార్యక్రమం లో తుడుం దెబ్బ నాయకులు బంధ శ్రీను సనప కృష్ణమూర్తి కృష్ణమూర్తి రిలే దీక్షలోకూర్చున్న భూభాదితులు బంధ రమణ, బంధ సుగుణ, తోలం సమ్మక్క, కోరం పుల్లమ్మ, చీమల అనసూయ పూణే, అనసూయ పూణే కోటయ్య,చీమల నరసింహారావు కల్తీ వినోద్ కల్తీ,మల్లయ్య కురుసం రామయ్య మచ్చ స్వామి పాల్గొన్నారు



## ఎడిటోరియల్

# నితీశ్ కుమార్‌కు అగ్నిపరీక్ష

బీహార్‌లో 2025 నవంబర్‌లో ఎన్నికలు జరుగుతున్న వేళ రాష్ట్రం ఇదే పాలన కొనసాగింపా? మార్పా? అనే చౌరస్తాలో ఉంది. బిజెపి ఆధ్వర్యంలోని ఎన్‌డీఎతో నితీశ్ కుమార్ తాజా రాజకీయ కలయిక తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలకు చారిత్రక ప్రాధాన్యం ఉంది. రెండు దశాబ్దాలకు పైగా బీహార్ రాజకీయాలకు నాయకత్వం వహిస్తున్న నితీశ్ కుమార్‌కు ఇది పాలనా సంస్కరణలు, సామాజిక ఇంజనీరింగ్, తరచు రాజకీయ పునర్నిర్మాణాల ద్వారా సాగిన ఒక యుగానికి చివరి అధ్యాయం కావచ్చు. 2025 అసెంబ్లీ ఎన్నికలు కేవలం అధికారం కోసం జరిగే మరో పోటీ కాదు. నితీశ్ కుమార్ శాశ్వతమైన, సంక్లిష్టమైన వారసత్వంపై ప్రజాభిప్రాయ సేకరణ కావచ్చు. లాలూ పాలన తర్వాత బీహార్‌లో అపూర్వ మార్పులకు శ్రీకారం చుట్టిన యువత ఆశలు ఆశయాలు, కులపరమైన పునర్వ్యవస్థీకరణల నేపథ్యంలో నితీశ్ మళ్లీ మరోసారి తమ పార్టీని నిలుపుకోగలరా అనే దానికి ఇదో పరీక్ష ప్రభుత్వ వ్యతిరేకత, నితిశ్ సామర్థ్యం నితీశ్ కుమార్ దాదాపు 20 ఏళ్లుగా బీహార్‌ను పాలించారు. ఆధునిక బీహార్ రాజకీయాల్లో ఇదో రికార్డు. ఆయన పాలనలో 1990వ నాటి జంగల్ రాజ్ నుంచి రాష్ట్రం సుస్థిరత, మెరుగైన శాంతి భద్రతలు, విస్తరించిన మౌలిక సదుపాయాలతో మారింది. సుదీర్ఘకాలన ప్రభుత్వ వ్యతిరేకతను పెంచింది. ముఖ్యమంత్రి తరచు రాజకీయాల మార్పుల వల్ల -జెడి(యు) బిజెపి నుంచి మహాఘట్‌బంధన్‌కు, తిరిగి ఎన్‌డిఎకు మారడంతో ఆయనకు పాల్టూ రామ్ అన్న మారుపేరు తెచ్చిపెట్టింది. ఇది నితీశ్ ఇమేజ్‌ను, ఓటర్ల విశ్వాసాన్ని కూడా దెబ్బతీసింది. ఆయన రాజకీయ ఊగిసలాటల మధ్య పెరిగిన యువ ఓటర్లకు ఇది అస్థిరతగానే కన్పిస్తుంది. ఎన్‌డిఎలో నితీశ్ తప్పని, ఇష్టంలేని మిత్రుడుగానే కొనసాగుతున్నారు. జాతీయ స్థాయిలో ఆధిపత్యం చెలాయిస్తున్న బిజెపి ఆయనను ఆస్తిగానే కాదు అనవసరంగా నెత్తికి ఎత్తుకున్న భారంగానే భావిస్తోంది. జెడియు కుల సమతుల్యతను, పాలనపై విశ్వసనీయతను సాధించినా, ఆ పార్టీకి తగ్గుతున్న ప్రజాదరణ నితీశ్ అనంతరం మనుగడపై ప్రశ్నార్థకంగా నిలిచింది. ఇందుకు విరుద్ధంగా ఆర్‌డిఎకి చెందిన తేజస్వి యాదవ్ నాయకత్వంలోని మహాఘట్‌బంధన్, నితీశ్‌ను రాజకీయ అవకాశవాదం, పాలనా స్తబ్ధతకు చిహ్నంగా చిత్రీకరిస్తోంది. వారి కొత్తనినాదం 'నయా సోచ్, నయా బీహార్' యువతలో కొత్త ఆకర్షణ మంత్రం అయింది. యువ, సామాజిక న్యాయం ఆధారిత రాజకీయాలకు ప్రాతినిధ్యంవహిస్తున్న తేజస్వి ప్రభుత్వ వ్యతిరేకతను తరాల మార్పుగా మార్చాలని ఆశిస్తోందిబీహార్ రాజకీయ చిత్రంలో తరాల మార్పు 2025లో తొలిసారి ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఓటు వేస్తున్నవారిలో చాలా మంది 2005లో నితిశ్ కుమార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పుట్టినవారే. ఈ నితీశ్ తరానికి అభివృద్ధి అంటే పాలనా సంస్కరణలు, బాలికలకు సైకిళ్లు, మెరుగైన రోడ్లు కానే కావు. వారి ఆశలు, అంచనాలు వేరేగా ఉన్నాయి. ఈ ఓటర్లలో చాలామంది ఇప్పుడు నిరుద్యోగం, వలస సమస్యలు, వారి ఆకాంక్షలను తీర్చలేని విద్యా వ్యవస్థను ఎదుర్కొంటున్నారు. యువత ఆకాంక్షలను ఓట్లుగా మార్చుకోవడమే తేజస్వియాదవ్ ముందున్న సవాల్. 2020 ఎన్నికల్లో తేజస్వి 10లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తానన్న హామీ అసాధ్యమని విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, యువతను ఎక్కువ ఆకట్టుకుంది. ఇప్పుడు మరింత జాగ్రత్తగా, ఉద్యోగాలతోపాటు గౌరవంగా జీవించే అవకాశం, సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధితో ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు. సామాజికంగా బీహార్‌లో కులవ్యవస్థ లోతుగాపాతుకుపోయినా, దాని రాజకీయ ప్రాధాన్యతతగ్గింది. ఆర్‌జెడి సాంప్రదాయ ముస్లిం, యాదవ్ పునాది అధికారం అందుకునేందుకు చాల దు. దీంతో తేజస్వి అత్యంత వెనుకబడిన తరగతులు, మహిళలు, తొలిసారి ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు.

# అమెరికా ఆంక్షలకు పుతిన్ దిగివచ్చేనా?



శత్రువును జయించాలంటే కేవలం భుజబలం మాత్రమే ఉంటే చాలదు. పరిస్థితులను బట్టి సామ దాన భేద దండోపాయాలను ప్రయోగిస్తేనే ఫలితం సానుకూలమవుతుంది. ఆవేశమే తప్ప ఆలోచన అంతగా లేని అగ్ర రాజ్యాధినేత ట్రంప్ మహాశయుడికి ఈ విషయం గ్రహించడానికి పది నెలల సమయం పట్టిందంటే ఆశ్చర్యం ఏముంది? రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించడం తనకు చిటికెలో పని అంటూ ఆయన ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తాను అధికారంలోకి వస్తే ఇరవై నాలుగు గంటల్లో యుద్ధాన్ని ఆపేస్తానంటూ ప్రతినలు పలికారు. కానీ, రాజకీయాల్లో రష్యా అధినేత పుతిన్ తనకంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివారన్న వాస్తవం గ్రహించడానికి ఆయనకు ఇంతకాలం పట్టింది. ఉక్రెయిన్ యుద్ధ విరమణ దిశగా ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు పుతిన్ పురిట్లోనే సంధి కొడుతున్నారు. అలస్కాలో గత ఆగస్టు నెలలో పుతిన్ తో జరిగిన ముఖాముఖీ భేటీలో ఫలితమేమీ తేలకపోవడంతో ట్రంప్ అహం దెబ్బతింది. యుద్ధాన్ని ఆపాలంటే ఉక్రెయిన్ లో కొన్ని భూభాగాలను తమకు దఖలు పరచాల్సిందేనంటూ మొండికేస్తున్న పుతిన్ ను దారికి తెచ్చేందుకు తాజాగా ఆయన రష్యా చమురు కంపెనీలపై ఆంక్షల కొరడా ఝుళిపించారు. %ూశ్రీంశీ =ఘుఃం% - నితీశ్ కుమార్‌కు అగ్నిపరీక్ష %ూఃజవతీఱంవఎవత్% మరిన్ని కనుగొనండి జాతీయ వార్తలు స్థానిక ఉత్పత్తులు లైఫ్ స్టైల్ యాడ్‌ఫ్రీ వెబ్‌సైట్ సబ్‌స్క్రిప్షన్ సినిమా టిక్కెట్లు అంతర్జాతీయ వార్తా పత్రికలు క్రీడా వస్తువులు ఆంధ్రప్రదేశ్ వార్తలు కెరీర్ కౌన్సెలింగ్ తెలంగాణ వార్తలు ఈ పరిణామం పుతిన్ ను ఒక కుదుపు కుదిపిందనే చెప్పాలి. రష్యాలోని అతి పెద్ద చమురు కంపెనీలు రాస్ నెఫ్ట్, లుకాయిల్‌పై అమెరికా, ఐరోపా కూటమి విధించిన ఆంక్షల ప్రభావం రష్యా తోపాటు భారత్, చైనాలపై ఎక్కువగా పడింది. ఆ రెండు కంపెనీలకూ అనుబంధంగా పనిచేస్తున్న పలు సంస్థలకూ ఆంక్షలు వర్తింపజేయడంతో రష్యా నుంచి చమురు ఎగుమతులు స్తంభించిపోయే పరిస్థితి నెలకొంది. తాజా ఆంక్షలతో 557 చమురు షాడో కంపెనీలపై నిషేధం పడినట్లయింది. అమెరికా, ఐరోపా దేశాలు తీసుకున్న నిర్ణయం కారణంగా ముడి చమురు ధరలకు రెక్కలు వచ్చాయి. చమురును రవాణాచేసే సూపర్ ట్యాంకర్ల చార్జీలు ఒక్క రోజే 16 శాతం పెరగడం ఇందుకు ఒక ఉదాహరణ. గత రెండేళ్లలో ఇలా చార్జీలు పెరగడం ఇదే మొదటిసారి. అమెరికా ఆంక్షలకు తలొగ్గేది లేదంటూ పుతిన్ బీరాలు పలుకుతున్నా చమురు కొనుగోళ్లు నిలిచిపోతే, ఇప్పటికే యుద్ధం కారణంగా అతలాకుతలమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం అసాధ్యమన్న సంగతి ఆయనకు తెలియనిదేమీ కాదు. %ూశ్రీంశీ =ఘుఃం% - ప్రధానితో అదానీ బంధం ప్రమోదమా.. ప్రమాదమా? తాజా ఆంక్షల వల్ల రష్యా తన సైనిక కార్యకలాపాలకు నిధులు సమకూర్చే సామర్థ్యం తగ్గుతుంది. దీంతోపాటు దాని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుందనేది నిర్వివాదాంశం. అయితే ఆంక్షలు ఎంతమేరకు కట్టుదిట్టంగా అమలవుతాయో వేచి చూద్దామనే ధోరణిలో ఆయన ఉన్నట్లు కనబడుతోంది. ఒకప్పుడు పుతిన్ ను టఫ్ గై, స్మార్ట్ గై అంటూ ఆకాశానికి ఎత్తేసిన ట్రంప్ కు పుతిన్ అసలు రూపం ఇప్పుడు బోధపడినట్లుంది. తాజాగా బుడాపెస్ట్ లో ఇరువురు అధినేతల మధ్య జరగవలసిన భేటీని పుతిన్ రద్దు చేసుకోగా, ఫలితం తేలని చర్చల వల్ల ప్రయోజనమేమిటంటూ ట్రంప్ పెదవి విరచడానికి కారణం అదే. భారత్ విషయానికొస్తే, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచీ రష్యా చమురును చౌకగా కొనుగోలు చేస్తోంది. భారత ముడిచమురు అవసరాల్లో మూడో వంతు భాగం రష్యానుంచే దిగుమతి అవుతోంది. %ూశ్రీంశీ =ఘుఃం% - లొంగుబాటా.. పోరుబాటా? %ూఃజవతీఱంవఎవత్% ఈ ఏడాది ఇప్పటివరకూ సగటున రోజుకు 1.7 మిలియన్ బారెళ్ల చమురును భారత్ దిగుమతి చేసుకుంటే, ఇందులో 1.2 మిలియన్ బారెళ్ల చమురు తాజాగా నిషేధం వేటు పడిన రెండు సంస్థలనుంచే రావడం గమనార్హం. ఈ దిగుమతుల్లో అధిక వాటాను రిలయన్స్, నయారా ఎనర్జీ సంస్థలే కొనుగోలు చేస్తుండగా, స్వల్ప పరిమితిలో భారత ప్రభుత్వ రంగ సంస్థలు దిగుమతి చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ లెక్కల ప్రకారం రష్యానుంచి భారత్ కు ప్రతి నెలా సుమారు ఏడు మిలియన్ బారెళ్ల చమురు దిగుమతి అవుతోంది. ప్రపంచ ముడి చమురు, రిఫైన్డ్ వినియోగంలో ఇది ఏడు శాతానికి సమానం. అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోక తప్పని పరిస్థితుల్లో భారత్ కు మళ్లీ పశ్చిమాసియాయే దిక్కయ్యేటట్లు కనిపిస్తోంది. అదే జరిగితే, ప్రస్తుతం భారత్ పై 50 శాతానికి పెంచిన సుంకాలను అమెరికా 15 శాతానికి తగ్గించే అవకాశం లేకపోలేదు.

# ప్రధానితో అదానీ బంధం ప్రమోదమా.. ప్రమాదమా?



ప్రధాని నరేంద్ర మోడీ, పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ మధ్య కొనసాగుతున్న దీర్ఘకాలిక సంబంధం భారత రాజకీయశక్తి, కార్పొరేట్ ప్రభావం మధ్య ఉన్న అనుబంధం మళ్లీ చర్చను రేపుతోంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దీనిని మోడానీ నెక్సస్ అని పిలుస్తూ, ప్రభుత్వ విధానాలు ప్రైవేట్ వ్యాపార ప్రయోజనాల మధ్య సంబంధాలు గట్టిపడి సామాన్యుల బతుకు బజారుకీడ్చిందని ఆరోపించారు. గత రెండు దశాబ్దాలుగా అదానీ గ్రూప్ విస్తరణతోపాటు, నియంత్రణ సడలింపులు, ఆర్థిక పారదర్శకత, ప్రభుత్వ ప్రాధాన్యత వంటి ప్రశ్నలు నిరంతరం లేవనెత్తుతున్నాయి. ఈ చర్చను మరింత వేడెక్కించినవి రెండు ప్రధాన పరిణామాలు ఒకటి 2023లో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక, ఇది అదానీపై ఆర్థిక అక్రమాల ఆరోపణలు చేసింది, గత వారంలో ది వాషింగ్టన్ పోస్ట్ వెలుగులోకి తెచ్చిన ప్రభుత్వ సహకారంతో జరిగిన బిలియన్ల డాలర్ల బెయిల్ అవుట్. ఇవి రెండూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆర్థికశక్తి, రాజకీయ అధికారాల అంతర్గత బంధంపై తీవ్రమైన సందేహాలను రేకెత్తించాయి. మోడీ అదానీ బంధం మూలాలు 2000 ప్రారంభంలో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి కాలం నుంచి ఉన్నాయి. 2014లో మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, అదానీ వ్యాపార సామ్రాజ్యం గణనీయంగా విస్తరించింది. అతని ఆస్తులు 230 శాతం పెరిగి 90 బిలియన్ డాలర్లకు చేరాయి. %ూశ్రీంశీ =ఘుఃం% - అమెరికా ఆంక్షలకు పుతిన్ దిగివచ్చేనా? %ూఃజవతీఱంవఎవత్% పోర్టులు, విమానాశ్రయాలు, శక్తిరంగాల వంటి కీలక రంగాల్లో అదానీ కంపెనీలు పెద్ద కాంట్రాక్టులు గెలుచుకున్నాయి. 2018లో విమానాశ్రయాల ప్రైవేటీకరణ నిబంధనలు మార్చబడటంతో, విమానయాన అనుభవం తక్కువ ఉన్నప్పటికీ, అదానీ ఆరు ప్రధాన విమానాశ్రయాలపై నియంత్రణ సాధించాడు. కేరళ ఆర్థిక మంత్రి దీన్ని నిర్లజ్జమైన స్నేహపూర్వక వ్యాపారంగా అభివర్ణించారు. విపక్ష పార్టీలు ఈ పరిణామాలు యాదృచ్ఛికం కావని, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అదానీ కంపెనీలు బిజెపికి భారీ విరాళాలు ఇచ్చి, ప్రతిగా విధాన సడలింపులు పొందుతున్నాయని ఆరోపిస్తున్నాయి. 2025 జూన్‌లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య - డబ్బు, విధానం మీది, లాభం, సౌలభ్యం అదానీది ఈ ఆరోపణలకు ప్రతీకగా నిలిచింది. బిజెపి నేతలు ఈ విమర్శలను కొట్టి, అదానీ ఎదుగుదల మోడీ నాయకత్వంలో దేశ నిర్మాణానికి సంకేతమని చెబుతున్నారు. %ూశ్రీంశీ =ఘుఃం% - నితీశ్ కుమార్‌కు అగ్నిపరీక్ష మోడీ అదానీ అనుబంధం క్రోనీజంను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లి, మార్కెట్ న్యాయాన్ని ప్రజావిశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. 2023 జనవరిలో అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ విడుదల చేసిన నివేదిక, అదానీపై ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక మోసం ఆరోపణలు చేసింది. ఈ నివేదికలో షేర్ ధరల మానిప్యులేషన్, తప్పుడు లెక్కలు, మారిషస్ ఆధారిత షెల్ కంపెనీల ద్వారా మార్కెట్ విలువ పెంపు వంటి అంశాలు వెల్లడించబడ్డాయి. ఫలితంగా, అదానీ గ్రూప్ మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్లు కోల్పోయింది. అలాగే ఎల్‌ఐసి 5.6 బిలియన్ డాలర్ల నష్టపోయింది. అదానీ దీన్ని భారత దేశంపై కుతంత్ర దాడిగా పేర్కొని, వ్యతిరేకంగా 413 పేజీల వివరణ ఇచ్చారు. సెబీ కొన్ని ఆరోపణలను కొట్టివేసినా, విదేశీ పెట్టుబడులపై అనేక అనుమానాలు ఇంకా కొనసాగుతున్నాయి. గతవారం ది వాషింగ్టన్ పోస్ట్ మరో ప్రకంపన రేపింది. %ూశ్రీంశీ =ఘుఃం% - లొంగుబాటా.. పోరుబాటా? %ూఃజవతీఱంవఎవత్% ఆ నివేదిక ప్రకారం భారత ప్రభుత్వం ఎల్‌ఐసి ద్వారా 3.9 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్రణాళికను రూపొందించి. అదానీ కంపెనీల బాండ్లు, షేర్లలో పెట్టుబడులు పెట్టించిందని తెలిపింది. అప్పట్లో అదానీ గ్రూప్ అప్పులు పెరుగుతుండగా, ప్రభుత్వం అధిక వడ్డీ రేట్లను సాకుగా చూపి ఎల్‌ఐసి నిధులను వినియోగించినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఈ ప్రకటనలతో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. జైరాం రమేష్ దీనిని మోడానీ మెగా స్కామ్‌గా పేర్కొనగా, మల్లికార్జున ఖర్గే ప్రజల బీమా పొదుపులు కార్పొరేట్ రక్షణకు వినియోగించబడ్డాయని విమర్శించారు. ఎల్‌ఐసి అదానీ కంపెనీలు ఈ ఆరోపణలను అసత్యంగా కొట్టి, పెట్టుబడులు వ్యాపారపరమైనవే అని స్పష్టం చేశాయి. పోర్టులు, విద్యుత్, రవాణా వంటి కీలక రంగాల్లో అదానీ గ్రూప్ దేశపు మౌలిక వసతులలో సుమారు ఐదవ వంతు వాటా కలిగి ఉంది. మద్దతుదారుల దృష్టిలో ఇది దేశ ఆత్మనిర్భరతకు ప్రతీక, విమర్శకుల దృష్టిలో ఇది స్నేహపూర్వక పాజీవాదంకి చిహ్నం. ఈ పరిణామాలు కార్పొరేట్ పాలనకే కాదు, సాధారణ ప్రజలకూ ప్రమాదకర సూచనలు ఇస్తున్నాయి. ఎల్‌ఐసి, పెన్షన్ నిధులు వంటి ప్రజాసంస్థలు రాజకీయ నిర్ణయాల ప్రభావానికి లోనవుతుండటం, ఆర్థిక వ్యవస్థలో నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. మొత్తంగా, మోడీ అదానీ సంబంధం కేవలం ఇద్దరి వ్యక్తుల గాథ మాత్రమే కాదు, ఇది ఉదయోన్ముఖ ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ అధికారాలు ఆర్థిక శ్రేణులను ఎలా మలుస్తాయన్న సందేహం కలుగుతుంది.

# ‘మిమ్మల్ని నోబెల్‌కు నామినేట్ చేశా’- ట్రంప్‌నకు చెప్పిన జపాన్ ప్రధాని



అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌తో జపాన్ ప్రధానమంత్రి సనాయీ తకాయిచీ కీలక విషయాన్ని చెప్పారు. నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్‌ను తాను నామినేట్ చేశానని ఆమె వెల్లడించారు. ఈ అంశాన్ని ధ్రువీకరిస్తూ అమెరికా వైట్ హౌస్ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. తాజాగా టోక్యోలో ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా ఈవిషయాన్ని ట్రంప్‌కు జపాన్ ప్రధాని తెలియజేశారని వెల్లడించింది. టోక్యోలోని అకాసకా ప్యాలెస్‌లో ట్రంప్‌తో జపాన్ ప్రధానమంత్రి సనాయీ తకాయిచీ భేటీ అయ్యారు. థాయ్‌లాండ్ – కంబోడియా శాంతి ఒప్పందం, చారిత్రక గాజా కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా ప్రపంచ శాంతిని ట్రంప్ పెంపొందించారని ఆ సందర్భంగా సనాయీ తకాయిచీ కొనియాడారు. దౌత్యమార్గాల ద్వారా అమెరికా ప్రెసిడెంట్ ప్రపంచ శాంతి స్థాపన చేయడం చాలా మంచి విషయమన్నారు.

ఈసారి ఆసియా దేశాల పర్యటనలో ట్రంప్ ప్రధాన అజెండాగా ‘రేర్ ఎర్త్ మినరల్సే’ ఉన్నాయి. ఆసియాన్ సదస్సు వేదికగా ‘రేర్ ఎర్త్ మినరల్స్’పై సహకారం కోసం థాయ్‌లాండ్, కంబోడియా, మలేషియాలతో ట్రంప్ ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తాజాగా జపాన్‌తోనూ దీనిపై ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. ఈమేరకు సమాచారంతో జపాన్ మీడియాలో పతాక శీర్షికన కథనాలు ప్రచురితం అయ్యాయి. రేర్ ఎర్త్ మినర్సల్ మార్కెట్‌పై పట్టును పెంచుకునే ప్రయత్నాల్లో చైనా ఉన్నందున, ఆసియాలోని ఇతర దేశాల్లో ఉన్న విలువైన రేర్ ఎర్త్ మినర్సల్‌పై అమెరికా కన్నేసింది. వీటికి సంబంధించి జపాన్‌తో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ప్రెసిడెంట్ ట్రంప్ కీలక కామెంట్స్ చేశారు. జపాన్ – అమెరికాల కొత్త బంగారు శకాన్ని ఆరంభిస్తామని ఆయన ప్రకటించారు. బలమైన ద్వైపాక్షిక సంబంధాలతో ప్రపంచంలోనే గొప్ప భాగస్వామ్య కూటమిగా జపాన్–అమెరికా అవతరించాయన్నారు.‘జపాన్‌తో మాకు గొప్ప అనుబంధం ఉంది. ఈ దేశంపై మాకు ప్రత్యేకమైన ప్రేమ, గౌరవం ఉన్నాయి. మునుపెన్నడూ లేనంత బలంగా ఇప్పుడు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయి. జపాన్ ఏ సమయంలోనైనా ఎలాంటి ప్రశ్నైనా, సందేహమైనా నన్ను అడగొచ్చు. ఏ సహాయం కావాలన్నా నన్ను అడగొచ్చు. నాకు చేతనైన ప్రతీ సాయాన్ని జపాన్‌కు చేస్తాను’ అని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

# సరిహద్దుల్లో మళ్లీ ఘర్షణలు- 25మంది ఉగ్రవాదులను కాల్చి చంపిన పాక్ సైన్యం



పాకిస్థాన్–అఫ్గనిస్థాన్ సరిహద్దులో ఘర్షణలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఖైబర్ పఖ్తుంఖ్వా సమీపంలో జరిగిన ఘర్షణల్లో ఐదుగురు పాకిస్థాన్ సైనికులు మరణించినట్లు తెలిసింది. అఫ్గాన్ వైపు 25 మంది ఉగ్రవాదులు చనిపోయారని పాక్ సైన్యం తెలిపింది. అయితే చనిపోయింది ఉగ్రవాదులా తాలిబన్ దళాలా తెలియాల్సి ఉంది.కుర్రం, ఉత్తర వజీరిస్తాన్ జిల్లాల్లో సరిహద్దులను దాటి ఉగ్రవాదులు పాక్‌లోకి ప్రవేశిస్తుండగా దాడులు చేసినట్లు సైన్యం వివరించింది. నలుగురు ఆత్మాహుతి బాంబర్ల సహా 25మంది ఉగ్రవాదులను పాకిస్థాన్ భద్రతా దళాలు కాల్చి చంపినట్లు సైన్యం వివరించింది. ఉగ్రవాదులతో జరిగిన ఘర్షణల్లో ఐదుగురు భద్రతా సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పయినట్లు తెలిపింది. ఈ చొరబాటు ప్రయత్నాలు ఉగ్ర సమస్యను పరిష్కరించాలన్న అఫ్గాన్ ప్రభుత్వ ప్రకటనలను సందేహాస్పదంగా మార్చాయని పాక్ ఆరోపించింది. శుక్రవారం రాత్రి ఉత్తర వజీరిస్తాన్, కుర్రం జిల్లాల్లో నిర్వహించి సెర్చ్ ఆపరేషన్‌లో అఫ్గాన్ సరిహద్దుల నుంచి భారీగా పెద్ద మొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడులపై అఫ్గానిస్థాన్ ఇంకా స్పందించలేదు.ఖతార్, తుర్కియే మధ్యవర్తిత్వంతో దోహా వేదికగా ఇటీవల జరిగిన చర్చల్లో పాక్- అఫ్గాన్‌లు తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించాయి. కానీ కొలిక్కి రాలేదు. ఈ క్రమంలోనే శనివారం ఇస్తాంబుల్‌లో ఇరు దేశాల మధ్య రెండో విడత చర్చలు జరుగుతన్నాయి. చర్చలు జరుగుతుండానే ఈ ఘర్షణ జరిగాయి. శాంతి చర్చలపై అంగీకారానికి రాకుంటే అఫ్గాన్‌తో పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటిస్తామని పాక్ రక్షణమంత్రి ఖావాజా అసీఫ్ మరోసారి హెచ్చరించారు. మరోవైపు పాక్–అఫ్గాన్ ఘర్షణల్ని చాలా త్వరగా పరిష్కరిస్తానని మలేసియా పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌లు గొప్ప వ్యక్తులు అని ట్రంప్ వ్యాఖ్యానించారు.తెహ్రీక్ ఏ తాలిబాన్ () ఉగ్రవాద సంస్థ పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పెద్దఎత్తున ఉగ్రదాడులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో టీటీపీ ఉగ్రవాద స్థావరాలన్నీ అఫ్గనిస్థాన్‌లోనే ఉన్నాయని పాక్ ఆరోపించింది. ఇటీవలే కాబూల్ నగరంపై పాక్ సైన్యం వైమానిక దాడులు చేసింది. ఈ ఘటన తర్వాత అక్టోబరు 11న పాక్, అఫ్గన్ బార్డర్‌లో సైనిక ఘర్షణ పెరిగింది. తాలిబన్ల దాడుల్లో పెద్దసంఖ్యలో పాక్ సైనికులు చనిపోయారు. గత మూడు నెలల్లో మాత్రమే 50 మందికి పైగా మృతి చెందారు. ఈ క్రమంలో అక్టోబర్ 11 నుంచి సరిహద్దులను మూసివేశారు. దీంతో ఇరుదేశాల ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పాకిస్థాన్ బోర్డర్ మూసివేయడంతో అఫ్గాన్ వ్యాపారులు ప్రతి రోజు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడే స్తంభించడంతో సరకును సరఫరా చేసేందుకు కష్టతరమవుతోంది. దీని ప్రభావంతో రెండు దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి.

# పుతిన్ అణ్వస్త్ర మిస్సైల్ టెస్ట్ సరికాదు- మా న్యూక్లియర్ సబ్‌మెరైన్ రష్యా తీరంలోనే: ట్రంప్

అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన బ్యూర్‌వెస్ట్నిక్ క్రూయిజ్ మిస్సైల్‌ను రష్యా పరీక్షించడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుపట్టారు. ఇప్పుడు ఆ టెస్ట్‌ను నిర్వహించడం సరికాదన్నారు. ఇలాంటి పనులకు బదులుగా, ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపడంపై ధ్యాస పెట్టాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ట్రంప్ సూచించారు. అమెరికా దగ్గర అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన సబ్‌మెరైన్ ఉందనే విషయాన్ని పుతిన్ గుర్తుంచుకోవాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆ జలాంతర్గామి రష్యా సముద్ర తీరంలోనే కాచుకు కూర్చుందని ఆయన తెలిపారు. తమ అణ్వస్త్ర సబ్‌మెరైన్‌కు 8వేల మైళ్లు ప్రయాణించాల్సి అవసరం లేదని ట్రంప్ చెప్పారు. అమెరికాతో రష్యా కానీ, రష్యాతో అమెరికా కానీ ఆటలేం ఆడటం లేదన్నారు. తాము నిత్యం మిస్సైళ్లను టెస్ట్ చేస్తూనే ఉంటామన్నారు. జపాన్ పర్యటనలో ఉన్న డొనాల్డ్ ట్రంప్, తన అధికారిక విమానం ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.‘ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని తప్పక ఆపుతానని చెప్పిన పుతిన్, ఇప్పుడు న్యూక్లియర్ మిస్సైల్ టెస్ట్ గురించి మాట్లాడుతున్నారు. ఇలా చేయడం సరికాదు. ఉక్రెయిన్ – రష్యా యుద్ధం వారంలో ముగియాల్సింది. కానీ అది నాలుగేళ్లుగా కొనసాగుతోంది. మిస్సైళ్లను టెస్ట్ చేయించడాన్ని ఆపి, ఈ యుద్ధాన్ని ఆపడంపై పుతిన్ ధ్యాస పెట్టాలి’ అని ట్రంప్ కామెంట్స్ చేశారు.

తాజాగా రష్యా పార్లమెంటులో ఆ దేశ ప్రెసిడెంట్ పుతిన్ సంచలన ప్రకటన చేశారు. చిన్న సైజు న్యూక్లియర్ పవర్ యూనిట్‌ను తయారు చేశామని, దాన్ని బ్యూర్‌వెస్ట్నిక్ క్రూయిజ్ మిస్సైళ్లలో అమర్చి వాడొచ్చని ఆయన వెల్లడించారు. అన్ లిమిటెడ్ రేంజ్ కలిగిన ఆ మిస్సైల్ ఎంతదూరమైనా వెళ్లగలదన్నారు. ప్రస్తుతానికి ఇలాంటి క్షిపణి ప్రపంచంలో రష్యా దగ్గర మాత్రమే ఉందని పుతిన్ చెప్పారు. ఈ క్షిపణి తక్కువ ఎత్తులో, ఎవరికీ అంతుచిక్కని దిశలో ప్రయాణించగలదన్నారు. ఇప్పటికే బ్యూర్‌వెస్ట్నిక్ మిస్సైల్ పరీక్ష విజయవంతమైందని, దాని మోహరింపును మొదలుపెడతామని ఆయన తెలిపారు. బ్యూర్‌వెస్ట్నిక్ క్రూయిజ్ మిస్సైల్ గాల్లోనే 15 గంటల పాటు ఉండగలదని రష్యా అధికార వర్గాలు వెల్లడించాయి. 8,700 మైళ్ల (14వేల కిలోమీటర్ల) దూరంలోని శత్రు లక్ష్యాలను అది ఛేదించగలదని చెప్పాయి. ఈ ప్రకటనకు స్పందనగానే ట్రంప్‌పై వ్యాఖ్యలు చేశారు. 2000 సంవత్సరం సెప్టెంబరులో అమెరికా- రష్యా మధ్య ప్లుటోనియం డిస్పోజల్ అగ్రిమెంట్ కుదిరింది. ఇరుదేశాలు తమ వద్దనున్న 34 టన్నుల న్యూక్లియర్ వెపన్ గ్రేడ్ ప్లుటోనియంను నిర్వీర్యం చేసి, పారవేయాలని ఆనాడు నిర్ణయించాయి. అయితే ఈ ఒప్పందం ప్రస్తుతం అమల్లో లేదు. దీన్ని అధికారికంగా రద్దు చేసే ఒక చట్టాన్ని పుతిన్ తీసుకొచ్చారు. దీనివల్ల ఇకపై ఎలాంటి అడ్డూఅదుపు లేకుండా అణ్వస్త్రాలను అమెరికా, రష్యా తయారు చేసుకోవచ్చు. ఈ చట్టానికి సంబంధించిన బిల్లుకు ఈ నెల ఆరంభంలోనే రష్యా పార్లమెంటులోని దిగువ సభ ఆమోదం తెలిపింది. తాజాగా అక్టోబరు 22న పార్లమెంటులోని ఎగువ సభ కూడా దీనిపై ఆమోద ముద్ర వేసింది. ప్రెసిడెంట్ పుతిన్ కూడా ఆమోదించడంతో, ఈ చట్టం అక్టోబరు 27 (సోమవారం) నుంచి అమల్లోకి వచ్చింది.రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ మళ్లీ ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. తనశైలిలో నిర్ణయాలు తీసుకుంటూ ఇప్పటికే రాజకీయ రంగంలో చర్చనీయాంశంగా మారిన ట్రంప్, ఇప్పుడు మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు సంకేతాలిచ్చారు.అమెరికా రాజ్యాంగం ప్రకారం రెండు సార్లు మాత్రమే అధ్యక్ష పదవికి అవకాశం ఉన్నప్పటికీ, మూడోసారి పోటీ చేయాలనే ఆలోచనకు మార్గాలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. మలేసియా పర్యటన అనంతరం టోక్యో వెళ్తుండగా ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ మాట్లాడుతూ, “2028లో మూడోసారి పోటీ చేయమని స్టీవ్ బానన్ సూచించారు. నేను దానిని ఇష్టపడతాను. నా వద్ద అత్యుత్తమ రికార్డులు ఉన్నాయి” అని అన్నారు. అయితే వెంటనే దాని గురించి నేను ఇంకా సీరియస్‌గా ఆలోచించలేదని స్పష్టం చేశారు. 2028లో ఉపాధ్యక్ష పదవికి పోటీ చేయాలన్న ప్రశ్నపై ట్రంప్ సూటిగా స్పందించారు. “అది చాలా క్యూట్ ఆలోచన. కానీ ప్రజలు దీన్ని ఇష్టపడరని నాకు తెలుసు. నాకు కూడా ఆ పదవి ఆసక్తికరం కాదు” అని అన్నారు. ఉపాధ్యక్షుడిగా పోటీ చేసే అవకాశం ఉన్నప్పటికీ, తాను అలా చేయదలచుకోలేదని స్పష్టం చేశారు.

రిపబ్లికన్ పార్టీలో తన తరువాత నాయకత్వ బాధ్యతలు తీసుకునే వారిపై కూడా ట్రంప్ సూచనలు చేశారు. “మా వద్ద గొప్ప నాయకులు ఉన్నారు. వారిలో ఒకరు ఇక్కడే ఉన్నారు” అంటూ తన పక్కన ఉన్న విదేశాంగ మంత్రి మార్కో రుబియో వైపు చూపించారు. ఆయనతోపాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా బలమైన నాయకత్వం కలవారని ట్రంప్ ప్రశంసించారు. “జేడీ అద్భుతమైన నాయకుడు. ఈ ఇద్దరిపై ఎవ్వరూ పోటీ చేయాలనుకోరని నేను అనుకుంటున్నాను” అని పేర్కొన్నారు. ట్రంప్ మూడోసారి పోటీ చేసేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆ అంచనాలకు మరింత బలం చేకూర్చాయి. అయితే అమెరికా రాజ్యాంగం ప్రకారం ఏ అధ్యక్షుడైనా రెండు సార్లు మాత్రమే పదవిలో ఉండగలరు. దీనికి మినహాయింపు లేదు. అందుకే ట్రంప్ వ్యాఖ్యలు చట్టపరమైన చర్చలకు దారితీసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.ఆసియా పర్యటనలో ట్రంప్ ఇక ట్రంప్ ప్రస్తుతం ఆసియా పర్యటనలో ఉన్నారు. మలేసియా పర్యటనను



ముగించుకుని జపాన్ చేరుకున్నారు. మలేసియాలో జరిగిన ఆసియాన్ సదస్సులో పాల్గొన్న ఆయన పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశారు. థాయ్‌లాండ్– కాంబోడియా దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదరడం ఈ పర్యటనలో ప్రధాన ఘట్టంగా నిలిచింది. కౌలాలంపూర్ నుంచి బయలుదేరే ముందు ట్రంప్ మలేసియా ప్రజలకు అభివాదం చేసి, “ఇక్కడ గడిపిన సమయం అద్భుతంగా ఉంది. గొప్ప వాణిజ్య ఒప్పందాలు, అరుదైన ఖనిజాల ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా థాయ్‌లాండ్, కాంబోడియా శాంతి ఒప్పందం సంతకం కావడం గొప్ప ఘట్టం. మిలియన్ల మంది ప్రాణాలు రక్షించబడ్డాయి. ఇది నా జీవితంలోని గర్వకారణమైన క్షణం” అంటూ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు.రష్యా- భారత్ చమురు కొనుగోళ్ల విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. చమురు కొనుగోళ్లను భారత్ పూర్తిగా నిలిపేస్తోందని పునరుద్ఘాటించారు. అదే సమయంలో చైనా కూడా రష్యా నుంచి చమురు దిగుమతులను గణనీయంగా తగ్గించనుందని పేర్కొన్నారు. ఆసియాన్ సదస్సు కోసం మలేసియాకు బయలుదేరే ముందు ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకర్లుతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరగబోయే సమావేశంలో రష్యా చమురు కొనుగోళ్ల అంశం ప్రస్తావనకు వస్తుందా అని విలేకర్లు ప్రశ్నించారు. దానికి బదులిస్తూ, బహుశా నేను ఈ అంశంపై చర్చించవచ్చు. మీరే చూసి ఉంటారు. రష్యా నుంచి చైనా చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గిస్తోంది. భారత్ కూడా పూర్తిగా నిలిపేస్తోంది’ అని ట్రంప్ పేర్కొన్నారు.గత కొన్ని రోజులుగా రష్యా నుంచి చమురు భారత్ చమురు కొనుగోళ్లను తగ్గిస్తుందని అమెరికా అధ్యక్షుడు చెబుతూనే వస్తున్నారు. త్వరలో పూర్తిగా నిలిపేస్తోందని భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనకు హామీ ఇచ్చినట్లు ఇటీవల వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ వ్యాఖ్యలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే వస్తోంది. భారత్ ఇంధన విధానం అనేది దేశ ప్రయోజనాల ఆధారంగా ఉంటుందని స్పష్టం చేసింది.అలాగే భారత్–పాకిస్థాన్ యుద్ధాన్ని కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తావించారు. భారత్ పాకిస్థాన్ వివాదాన్ని పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ‘భారత్%–%పాకిస్తాన్ వివాదంతో సహా ఇతర యుద్ధాలను పరిష్కరించడం కష్టం అనుకున్నా. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని పరిష్కరించడం సులభం అని భావించా. కానీ కానీ అది విఫలమైంది. జెలెన్‌స్కీ, పుతిన్‌ల మధ్య తీవ్రమైన ద్వేషం ఉంది’అని ట్రంప్ అన్నారు. ఈ ఏడాది మే 10న సామాజిక మాధ్యమంలో అమెరికా మధ్యవర్తిత్వంతోనే భారత్–పాకిస్థాన్ యుద్ధాన్ని పరిష్కరించానని ట్రంప్ పేర్కొన్నారు. ఇప్పటి అదే విషయాన్ని అనేక సార్లు పునరావృతం చేస్తూ వస్తున్నారు. మూడో వ్యక్తి మధ్యవర్తిత్వం లేకుండా కాల్పుల విరమణకు వచ్చామని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను భారత్ ఖండిస్తూనే వస్తోంది.

పాకిస్థాన్‌తో తన వ్యూహాత్మక సంబంధాన్ని విస్తరించుకోడానికి అగ్రరాజ్యం ఒక అవకాశం కోసం ఎదురచూస్తోందని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అన్నారు. అయితే భారత్‌తో ఉన్న సత్సంబంధాలను అమెరికా వీడుకోదని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఖతార్‌లోని దోహాకు వెళ్లే మార్గంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పాకిస్థాన్‌తో చేస్తున్న ఏ పని అయినా, అది భారత్‌తో ఉన్న స్నేహాన్ని దెబ్బతీయదని అన్నారు. అలాగే దౌత్యం విషయానికి వస్తే భారతీయులు చాలా పరిణతి చెందినవారని, తమకు సంబంధంలేని వారితో భారత్‌కు సంబంధాలున్నాయని పేర్కొన్నారు. ఇదొక ఆచరణాత్మక విదేశాంగ విధానమని ఆయన అన్నారు. పాకిస్థాన్‌తో తాము చేస్తున్న స్నేహం, భారత్‌తో ఉన్న సంబంధాలను దెబ్బతీయదని తాము భావిస్తున్నట్లు రూబియో తెలిపారు.

కాగా పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత అమెరికా- పాక్ సంబంధాలు ఊపందుకున్నాయి. అంతేకాకుండా రెండు అణ్వస్త్ర దేశాల మధ్య ఉద్రిక్తతలను తానే తగ్గించానని ట్రంప్ పదేపదే పేర్కొంటున్నారు. దాయాది దేశం కూడా ట్రంప్ వాదనలను వత్తాసు పలకడం గమనార్హం.

# యూకేలో ఘోరం- జాత్యహంకారంతో భారతీయ యువతిపై అత్యాచారం

: యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఘోరం జరిగింది. జాత్యహంకార భావనతో భారత సంతతికి చెందిన 20 ఏళ్ల పంజాబీ యువతిపై ఓ శ్వేత జాతీయుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. శనివారం సాయంత్రం ఉత్తర ఇంగ్లండ్‌లోని వాల్ సాల్ పట్టణంలో ఉన్న పార్క్ హాల్ ఏరియాలో ఈ ఘటన జరిగిందని వెస్ట్ మిడ్‌ల్యాండ్స్ పోలీసులు వెల్లడించారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితుడి కదలికలతో కూడిన సీసీటీవీ కెమెరా ఫుటేజీని పోలీసులు విడుదల చేశారు. ఇది జాత్యహంకార భావనతో జరిగిన నేరమని, నిందితుడిని చూడగానే తమకు సమాచారాన్ని అందించాలని ప్రజలకు అత్యవసర సందేశాన్ని పోలీసులు విడుదల చేశారు. కొన్ని వారాల క్రితమే పార్క్ హాల్ ఏరియాకు సమీపంలోని ఓల్డ్‌బరీ ఏరియాలో ఓ బ్రిటీష్ సిక్కు మహిళపై అత్యాచారం జరిగింది. అది కూడా జాత్యహంకార భావనతో జరిగిన దాడే అని పోలీసులు గుర్తించారు. ఈ రెండు అత్యాచార ఘటనలకు లింక్ ఉందా? లేదా ? అనేది ఇప్పుడే చెప్పలేమని ఈ కేసును దర్యాప్తు చేస్తున్న డిటెక్టివ్ సూపరింటెండెంట్ రోనన్ టైరర్ స్పష్టం చేశారు. భారత సంతతి యువతిపై



పాశవిక దాడి జరిగిందని, వీలైనంత త్వరగా నిందితుడిని అరెస్టు చేస్తామన్నారు. ఈ అత్యాచారానికి పాల్పడిన శ్వేత జాతీయుడికి 30 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. తలపై చిన్నపాటి వెంట్రుకలతో, డార్క్ కలర్ దుస్తుల్లో నడుచుకుంటూ వెళ్తూ సీసీటీవీ కెమెరాలకు చిక్కాడని ఆయన తెలిపారు.పోలీసు అధికారులు, ఫోరెన్సిక్ నిపుణుల సహకారంతో సంఘటనా స్థలం నుంచి సాక్ష్యాలను సేకరించామని, నిందితుడి ప్రొఫైల్‌ను రెడీ చేస్తున్నామని డిటెక్టివ్ సూపరింటెండెంట్ రోనన్ టైరర్ చెప్పారు. ఈ కేసును అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేస్తామన్నారు. సంఘటన జరిగిన సమయంలో నిందితుడిని చూసిన ప్రత్యక్ష సాక్షులు, స్థానికుల నుంచి కూడా ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు డిటెక్టివ్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ఈ దారుణం జరిగిన సమయంలో పార్క్ హాల్ ఏరియాలోని ఇళ్లలో ఉన్న సీసీటీవీల్లో, అటువైపుగా రాకపోకలు సాగించిన కార్ల కెమెరాల్లో నిక్షిప్తమై సమాచారం కూడా తమకు కావాలన్నారు. నిందితుడి కదలికలు ఆ కెమెరాల్లో రికార్డయి ఉంటే, తమకు ఫుటేజీని ఇవ్వాలని ప్రజలను రోనన్ టైరర్ కోరారు.

బాధిత వర్గం ఆందోళనను అర్థం చేసుకోగలం : పోలీసు చీఫ్ సూపరింటెండెంట్

‘ఈ ఘటన జరిగిన వాల్‌సాల్ ప్రాంతంలో విభిన్న జాతులు, వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. ఈ దారుణ ఘటన వల్ల బాధిత వర్గం ఆందోళనకు గురవుతుందనే విషయం మాకు తెలుసు. బాధిత వర్గం ప్రజలతో మేం సంప్రదింపులు జరుపుతున్నాం. వారి ఆందోళనను, అభిప్రాయాలను మేం అర్థం చేసుకోగలం

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST : MANDAL DIST : MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101